మన్నించండి మాస్టారూ!

ప్రఫుల్లచంద్ర

"ముహూర్తం చూసుకునే వచ్చారా పంతులుగారూ?"

డ్రాయింగ్ రూంలో శ్రీవారి స్వరం హేళనగా వినిపించగా- వచ్చింది ఎవరా- అని కర్టెన్ కొద్దిగా తొలగించి చూసింది, ప్రక్కగదిలోని సౌమ్య.

సోఫాలో ఒక ముసలాయన. పసిమి నిమ్మ వర్ణం. కళ్ళలో దివ్య తేజస్సు. గంధపు బొట్టు. నిగనిగల గుండు. గోపాదమంత శిఖకూడా వున్నట్లుంది. చూపులలో గౌరవాన్ని ప్రేరేపించే ఏదో విలక్షణ ఆకర్షణ.

ఆయన ప్రక్కనే కూర్చున్నది కొడుకు కాబోలు. ఇద్దరికీ ఎంత తేడా! తండ్రి శాంత సరళ స్వభావుడు. కొడుకు కొరకొరల యాంగ్రీ యంగ్‌మాన్.

ముసలాయన గోడు వెళ్ళబోసుకుంటున్నాడు. రిటైర్ అయ్యాడట. కొడుకు ఎమ్.కామ్. ఫస్ట్‌క్లాస్ ఉద్యోగం దొరకలేదు. ఇద్దరాడపిల్లలు పెళ్ళికి సిద్ధంగా వున్నారు. స్వయంఉపాధి పథకం కింద కొడుకు బ్యాంక్ లోన్‌కి అప్లయిచేసాడట.

"నీవు లోను శాంక్షన్ చేస్తే మావాడు కిళ్ళీబంకు, మొబైల్ లాండ్రీ లాంటి దేదైనా నిర్వహించడానికి సిద్ధంగా వున్నాడు నాయనా!"

అంత దీనంగా అడగవలసి వచ్చి

వందుకు కాబోలు ఆయన స్వరం రుద్ధం అయింది. లోకంలోని నైరాశ్యం అంతా ఆ స్వరంలోనే దోబూచులాడుతోంది. కొడుకు తలవంచుకున్నా, జేవురించిన ముఖం, ఉబ్బిన ముక్కుపుటాలు— అతని ఆవేశాన్ని తెలుపుతున్నాయి. ఛీ! యింత బ్రతుకూ బ్రతికి యిలాంటి వికృష్ట ఉపాధిలు చేయడం అతనికి సుతరామూ యిష్టం లేనట్టుంది. మరి దేశంలోని నిరుద్యోగ సమస్య అలాంటిది.

సౌమ్యకు ఆ వృద్ధమూర్తి మీద అంతులేని జాలి కలిగింది. కర్టెన్ మాటేసి సంభాషణ వింటోంది.

ఎంత వెక్కిరింగా నవ్వారు శ్రీవారు. "తమరు, సద్బ్రాహ్మణ సంజాతులు మొబైల్ లాండ్రీ— తమ కులవృత్తి కాదే!"

ఆ హేళన— ముసలాయన హృదయంలో శూలంలా దిగబడి పోతుంది. శ్రీవారెందుకంత అసహ్యంగా మాట్లాడుతున్నారో అర్థం కాలేదు సౌమ్యకు.

అయితే అతనికొక సరదా వుంది. ఎవరేది అడిగినా ముందు నిరాకరించటం, కాసేపు ఏడిపించి, తరువాత సరేననడం— ముందు కష్టించి, కష్టాలు అనుభవించనిచ్చి, తరువాత తీరికగా వరాలిచ్చే దేవునిలా!

కాని అతని ఈ సరదా ఆశ్రితుల వద్దనే గాని ఆఫీసు వ్యవహారంలో కాదు. బ్యాంక్‌లో అతడు నిజాయితీపరుడైన స్ట్రిక్ట్ ఆఫీసర్.

ముసలాయన బ్రతిమాలుతున్న కొద్దీ, శ్రీవారి స్వరంలో హేళన ఎక్కువ అవుతున్నది. అతని కది సరదా. కవ్వింపులా వుండవచ్చు గాని ముసలాయన కొడుక్కి మాత్రం గాయంమీద కారం రాసినట్లుంది. పైగా యిచ్చే లోన్‌లో యిరవైశాతం లంచం కోరడం— ముష్టిలో ముష్టిగా అనిపించి కసిగా చూసాడు.

అప్పుడే స్నేహితు డెవరో వస్తే బ్యాంక్ మానేజర్ బయటకు వెళ్ళగా లభించిన ఏకాంతంలో— కోపం అంతా కక్కేసాడు యువకుడు.

"చూసావా నాన్నా! ఈయ నేదో తప్పక తలకెత్తుతాడని నీవు ఆశించావు గాని నాకు మొదట్నించీ నమ్మకం లేదు. ఈ జాతే అంత! వీళ్ళు ప్రభుత్వానికి దత్తపుత్రులు! ఉద్యోగాలు వీళ్ళకే. ప్రమోషన్లు వీళ్ళకే. అప్పులు, భూములు, యిళ్ళు— అన్నీ వీళ్ళకే. మనకు మిగిలింది పట్టెడు బూడిద, భుజం మీంచి అడ్డంగా ఒక తాడు— ఉరిపోసుకోడానికి!"

తగ్గు స్వరంలో అనడానికి ప్రయత్నిస్తున్న కొద్దీ యువకునిలో ఆవేశం తన్నుకువస్తోంది. స్వరంలో కసి బుసలు కొడుతోంది. కళ్ళలో క్రోధం

మెరుస్తోంది. గుండెలో నిస్సహాయత మూల్గుతోంది.

భర్తనూ, ఆయన కులాన్నీ ఆ యువకుడు నిరసిస్తోంటే ప్రక్క గది లోని సౌమ్య హృదయం కలుక్కు మంది.

ముసలాయన ముఖం గంభీరంగా మారింది. ఆలోచిస్తూ తల వంచు కున్నాడు.

"ఏమి టాలోచిస్తున్నారు?"

"నలభై ఏళ్ళ క్రితం - వేసవి సెల వుల్లో మా తాతగారి గ్రామం వెళ్ళాను. ఆయనొక పెద్ద భూస్వామి. ఆ రోజున ఆయన సేవకులు కొందరు ఒక యువ కుడిని కొరడాలతో కొడుతున్నారు. కాళ్ళతో తన్నుతున్నారు. పిడికిళ్ళతో గుద్దుతున్నారు. ఆ యువకుడు బాధతో విలవిలలాడిపోతున్నాడు ఉండ లు చుట్టుకుపోతున్నాడు. వంటిమీద వాతలు తేలుతున్నాయి. నల్లని శరీరంమీద ఎర్రగా రక్తం తొంగిచూస్తోంది. అయినా. విచిత్రం ఏమంటే- ఆ యువ కుడు ఏడ్వటంలేదు. ఎవరినీ బ్రతిమాలం లేదు. కాళ్ళా, వేళ్ళా పడలేదు.

ఇంతకూ అతడు చేసిన నేరం ఏమిటో? మా తాతగారి పొలంలోని నూతి నీళ్ళు చేదుకుని తాగడం!

దెబ్బలు తిని, తిని, స్పృహ కోల్పోయే ముందు, గభాలున లేచి, శక్తినంతా కూడదీసుకుని మా తాతగారి వద్దకు మెరుపులా లంఘించి వచ్చి దభీ మని నేలకొరిగాడు ఒరిగిపోతూనే చటుక్కున తలఎత్తి చుట్టూ చూసాడు. ఆ చూపులో శాపం ఉంది. ఉక్రోషం వుంది నిస్సహాయత వుంది. తీవ్రత వుంది...." అని కాసేపు ఆగి "ఆ తీవ్రతతో పోల్చితే నీ తీవ్రత ఎంత అని ఆలోచిస్తున్నా బాబూ! అతడు పొందిన అవమానంలో నీ అవమానం ఏమాత్రం! అతని ఆక్రందనలో నీ ఆక్రందన శాతం ఎంత? ఆలోచిస్తున్నా బాబూ!" శాంతంగా అని సోఫాలో చారబడి కళ్ళు మూసుకున్నా డాయన. ఇంకేమీ అనలేదు. ఆయన ముఖంలో విషాదం అలముకుంది.

తండ్రివైపు కొరకొర చూసాడు కొడుకు. ఆ చూపు గుచ్చి, గుచ్చి అడు గుతున్న దొకే ప్రశ్న: ఎప్పుడో, ఎవరో తాతముత్తాతలు చేసిన తప్పుకు మేం శిక్ష అనుభవించాలా?

నిశ్శబ్దం.... విచిత్ర నిశ్శబ్దం....

ఆ నిశ్శబ్దాన్ని భరించలేక సౌమ్య కిచెన్‌లోనికి వెళ్ళింది. ఆమెలో ఆలోచ నలు ముసురుకుంటున్నాయి.

శ్రీవారు మారిపోయారా? విశాల హృదయుడు, కులమతాలకు అతీతుడు- అని నమ్మి అతనిని ప్రేమించి, కులాంతర వివాహం చేసుకున్నందుకు- తనూ అందరిలాంటివాడనే. నిరూపించ బోతున్నారా! ఆ ముసలాయన కులాన్ని

ఆయన అలా హేళన చేయడం క్షంతవ్యమా?.

• • •

ఖాదీ భారత పౌరులను తయారు చేసే ఒక పాఠశాల

ఆ పాఠశాల ఉపాధ్యాయులలో రెండు వర్గాలు ఒక దానికి ద్వైపాదీనం మాష్టారు, మరొదానికి లక్ష్మణాచార్యులు నాయకులు. వారికి న్యాయాన్యాయాలతో పని లేదు. ఒకవర్గం అవునన్న దాన్ని రెండోవర్గం వ్యతిరేకించడమే.

రెండు వర్గాలలోనూ— కులం కాటు వేయని విశాలహృదయులు, అందరి మన్నన పొందినవారూ— జ్ఞానానందం, జానకిరామయ్య లాంటివారు లేకపోలేదు. కాని వారికి బోధన తప్ప యితర విషయాలు పట్టవు. బోధన తప్ప మిగిలిన అన్ని విషయాల్లోనూ తల మున్కలయే ఉపాధ్యాయులను గాని, వారి ప్రేరణతో రెండు వర్గాలుగా చీలిపోయి కక్షకొంది కొంత జరిగే పిల్లకోతులను గాని— ఈ జ్ఞానానందాలు జానకిరామయ్యలూ మార్చలేరు.

ఆ రోజు పాఠశాలలో వాతావరణం చాల ఉద్రిక్తంగా వుంది పరీక్షల్లో ఒక విద్యార్థి కాపీ చేస్తుండగా జానకిరామయ్య పట్టుకున్నాడు. విద్యార్థి హరిజన్! జానకిరామయ్య బ్రాహ్మణుడు కావడంతో ప్రారంభం అయింది అసలు రగడ..

ఆ సాయంకాలం ఊరి చివర కాలువలో స్నానంచేసి జానకిరామయ్య వస్తుండగా దారిలో అల్లరిగుంపు ఎదురైంది. నానా రభస చేసి రాళ్ళు విసిరారు. గుంపులోని వరప్రసాద్ విసరిన రాయి ఆయన నుదుట బలంగా తగిలింది. శివుడు మూడోకన్ను తెరచినట్లు రక్తం చిమ్మింది.

రక్తం కంటబడేసరికి అందరూ నిశ్చలంగా ఆగిపోయారు. ప్రసాద్ వణికిపోయాడు. అతడు తొమ్మిదో క్లాసు విద్యార్థి. మిగిలినవారు పాఠశాల విద్యార్థులు కారు. తమాషా చూడడానికి గుంపుతో వచ్చి, వాళ్ళతోబాటు తమాషాగా రాయి విసరితే— కర్మ కాలి— ఆ రాయే తగిలింది. మాష్టారు చూడనే చూసారు.

జానకిరామయ్య— చుట్టూ నిశ్చలంగా ఒకసారి పరికించి, కారుతున్న రక్తాన్ని తుడుచుకోనైనా తుడుచుకోకుండా ధీరగంభీరంగా ముందడుగు వేశాడు.

ఇంటికి వెళ్ళాక ఆ రాత్రి ప్రసాద్‌కి నిద్రపట్టలేదు ఆలోచనలు.. ఆలోచనలు

జానకిరామయ్యగారు మంచి మాస్టారు. ఆయన చెప్పే పాఠాలు గంటలతరబడి వినాలనిపిస్తుంది. భారత, రామాయణ గాథల్లో తనకు అనేక సందేహాలు వచ్చేవి.

చెట్టు వెనకనుండి రాముడు వాలిని

చంపడం అన్యాయం కాదూ? రాక్షసులకు కొమ్ములూ, కోరలూ ఉన్నాయా? ఆ రోజుల్లో సంఘజీవనం ఎలా ఉండేది?

ఇలాంటి ప్రశ్నలు క్లాసులో అడిగితే అందరూ నవ్వుతారు. అందువల్ల మాస్టార్ల యింటివద్ద ఆడగాలి కాని చాలమంది తనను యింటికి రానివ్వరు. కాని జానకిరామయ్యగారు మాత్రం అరుగు మీద చాపవేసి కూర్చోబెట్టి ఆప్యాయంగా సందేహాలు తీర్చుతారు. ఆయన స్వరంలో మాటలు ఎంత పొందికగా వినిపిస్తాయి! అవే మాటలు యితరుల నోటనుండి వస్తే గాలికబుర్లలా వినిపిస్తాయి!

చిన్నప్పటి నుండి తన కెందుకనో, పార్వతీదేవి అంటే భక్తి. మాస్టారు భార్యను చూస్తే ఆ పార్వతీదేవి ప్రత్యక్షమైనట్లు మనసు హాయిగా వుంటుంది! తనకు దాహంవేస్తే ఆమె గ్లాసులోనే మంచినీళ్ళు యిచ్చేది. ఇతరులైతే తన దోసిలిలో మంచినీళ్ళు పోస్తారు!

మరి మాస్టారుమీద తనెందుకు రాయి విసరినట్లు?

మనసు విలవిలలాడిపోయి, కళ్ళు జలజల వర్షించాయి.. ఇదంతా దైవాధీనం మాస్టారివల్లనే జరిగింది. ఆయన యింటికి చాలమంది విద్యార్థులూ, యితరులూ వస్తూవుంటారు తరతరాలుగా అగ్రవర్ణులు తమ కులాన్ని ఎలాగ అణగద్రొక్కి ఉంచారో - ఆయన వివరిస్తూ వుంటారు, వింటున్నంత సేపు ఆవేశం కలుగుతుంది. వీలైనప్పుడల్లా అగ్ర కులస్థుల మీద ప్రతీకారం తీర్చుకోవాలనిపిస్తుంది.

అలాగే లక్ష్మణాచార్యుల వారింటిలోనూ విద్యార్థులూ చేరుతూవుంటారు. ఎవరిమీదనో కారాలూ, మిరియాలూ నూరుతూ వుంటారు.

వారిని చూస్తే వీరికి, వీరిని చూస్తే వారికీ - అసూయ, ద్వేషం! అలా ద్వేషం అనే సైతాన్ తన మనసులో ప్రవేశించాడు మనిషిని ప్రేమించాలి, గౌరవించాలి కాని ఆ సైతాన్ తన కళ్ళు కప్పివేసి మంచిని కనిపించకుండా చేసాడు అందుకే అందుకే తను రాయి విసిరాడు.

జానకిరామయ్య మాస్టారికి క్షమాపణ చెప్పుకోవాలని నిర్ణయించుకున్న తర్వాతనే ప్రసాద్ హృదయం చల్లబడి నిద్రపట్టింది - ఆ రాత్రి.

కాని మర్నాడు స్కూలుకి వెళ్ళే దారి కిరువైపులా గోడలనిండా రాతలు జానకిరామయ్యను, ఆయన కులాన్నీ దూషిస్తూ, గుండు పిలకను అపహాస్యం పట్టిస్తూ

ప్రసాద్‌కి మరింత భయం వేసింది. తను రాయి విసరడం చూసిన మాస్టారు ఈ రాతలుకూడా తనవే అనుకోరు? ఈపాటికే ఆయన హెడ్మాష్టారికి ఫిర్యాదు చేసివుంటారు. తనకు శిక్ష తప్పదని భయపడుతూనే స్కూలుకి వచ్చాడు. స్టాఫ్‌రూంలోనికి తొంగి చూసాడు. అదొక రణరంగంలా వుంది.

"దోషులను శిక్షించే వరకు మనం పరీక్షల్ని బహిష్కరించాలి" లక్ష్మణాచారి ప్రతిపాదించాడు.

"సాటి మాస్టారికి అవమానం జరిగినందుకు నాకూ బాధగానే వుంది. కాని దోషుల్ని పట్టుకోడం నిమిషాల్లో జరిగే పనికాదు. మనం పరీక్షల్ని బహిష్కరిస్తే దోషులు కాని విద్యార్థులకే ఎక్కువ అన్యాయం జరుగుతుంది" అడ్డుతగిలాడు దైవాధీన.

కొట్టుకుంటారేమో అన్నంత తీవ్రంగా వాగ్యుద్ధం చెలరేగింది తరువాత.

అయితే జానకిరామయ్య మాస్టారు తన పేరు బయటపెట్టలేదన్న మాట! సంతోషం బదులు మరింత దుఃఖం కలిగింది ప్రసాద్‌కు. కిటికీ వంచం వంగి లోనికి చూసాడు.

ఒక మూల జ్ఞానానందం మాస్టారూ,

న్నదుట కట్టుతో జానకిరామయ్య కూర్చుని వున్నారు. ఇద్దరి ముఖాలలోనూ విషాద మేఘాలు కమ్ముకుని వున్నాయి. కళ్ళు అరమూతలు పడివున్నాయి. పెదవులు కంపిస్తున్నాయి—మనసులోనే ప్రార్థించు కుంటున్నట్లు.

"ప్రభూ!... దేవా! కులవైషమ్యంతో రెచ్చిపోతున్న ఈ పిచ్చివాళ్ళ బారినుండి, మా పాఠశాలను, దేశాన్ని రక్షించు తండ్రీ!....

హెడ్మాష్టర్ ప్రతిపాలంగా ఉపాధ్యాయులు పరీక్షలు నిర్వహించడానికి అంగీకరించారు గాని విద్యార్థులు కాపీ చేస్తున్నా, చూసీచూడనట్లు వదిలేసారు. అందుకు కొందరు సంతోషించినా, కష్టపడి పాఠాలు చదువుకున్న ప్రసాద్ లాంటి వాళ్ళు బాధపడ్డారు.

వేసవి సెలవుల తరువాత.నెలరోజులకు—జానకిరామయ్య మరో ఊరికి బదిలీ చేయించుకున్నాడు. పిల్లలంతా

ఎంతో బాధపడ్డారు. బదిలీ ఆపుచేయించడానికి ప్రయత్నించారు కాని మనసు విరిగినచోట మనజాలనని వెళ్ళిపోయాడాయన. ఆయన వున్నంత కాలమూ క్షమాపణ చెప్పుకోడానికి ధైర్యమే చిక్కలేదు ప్రసాద్‌కి. కాని రాత్రి పడుకునేటప్పుడు మాత్రం గురువుగార్ని ధ్యానించి "క్షమించండి మాస్టారూ!" అని విలపించేవాడు.

ఆయన వెళ్ళిపోయాక స్కూల్ వాతావరణమే మారిపోయింది. నోటిశక్తి, భుజబలమూ గల విద్యార్థులు దైవాదీనం అవారిల ప్రేరణతో క్లాసుల్లో అల్లరిచేయడం ప్రతి పుస్తకమూ చిరికి చిరికి గాలివాన చేయడం, కసితో బసలు కొట్టడం

ఈ క్రోధాంధుల యుద్ధంలో అమాయకు లెందరో నలిగిపోయారు. అదృష్టవశాత్తు ప్రసాద్ తండ్రికి బదిలీ కావడంతో-కులం కొటువేయని యింకో స్కూలులో చేరి ప్రసాద్ బ్రతికిపోయాడు.

• • •

డ్రాయింగ్‌రూంలోనికి మూడు కప్పులతో ఓవల్టిన్ తెచ్చిన సౌమ్య-భర్త ఒంటరిగా దీర్ఘాలోచనలో ఉండడం చూసి ఆశ్చర్యపోయింది.

ముసలాయనా, కొడుకూ వెళ్ళిపోయినట్లున్నారు...."లోన్ శాంక్షన్ చేస్తున్నారా, లేదా?" సౌమ్య స్వరం సౌమ్యంగా మాత్రం లేదు.

"ఆయన-మామూలు-యివ్వనన్నారు మరి!"

"జాలి లేదా మీకు? ఆయన్ని . ఆయన్ని లంచం అడుగుతారా మీరు?"

"అడక్కపోడానికి ఆయన ప్రత్యేకత ఏమిటి?"

ఏమిటో సౌమ్యకు తెలియదు కాని-ఆ వృద్ధసౌజన్యమూర్తి ప్రాణం మీదకు వస్తేగాని ఇతరుల సాయం అర్థించని అభిజాత్యుడు చాల కష్టాల్లో వుండి వుంటాడు. కనుక తప్పక సాయం చేయవలసిందే. అనిపించింది సౌమ్యకు.

"ఆ లంచం నే నిస్తా. వాళ్ళబ్బాయికి లోన్ ఇప్పించండి లేదా నా నగలు అమ్మి అయినా సరే నే నాయన కిస్తా" కటువుగానే అంది సౌమ్య.

"నటన చాలించి గంభీరంగా మారిపోయాడతడు.

"జానకిరామయ్యగారి కుటుంబానికి సాయంచేయలేకపోతే మానవత్వం అనే మాటకే అర్థంలేదు. నా మనుగడే వ్యర్థం. ఇన్నేళ్ళకాయన యిలా నా ముందు ప్రత్యక్షం కావడం నా కెంత సంతోషంగా వుందో తెలుసా? పదిహేనేళ్ళ క్రితం నాలో సైతాన్ ప్రవేశించాడు. నాది తెలిసీ తెలియని వయస్సు. మాస్టర్లలోనూ స్వార్థపరులుంటారని తెలియదు. స్వార్థం కోసం వాళ్ళ వైషమ్యాలు

రేపడానికికూడా వెనుదీయని తెలియదు. అలాంటి స్వార్థపరుల బోధన వల్ల నా కళ్ళకు పొరలు కమ్మాయి. హృదయానికి యినుపతెరలు పడ్డాయి. నేను భయంకర అగాధంలో కూలిపోయే లోగా మాస్టారి క్షమాగుణం నా కంటి పొరల్ని తొలగించివేసింది. ఇనుప తెరల్ని కరిగించివేసింది. నే నప్పుడు ఆయనకు క్షమాపణ చెప్పలేక పోయాను ధైర్యం చాలక కాని యిప్పుడు నేనొక మనిషిగా మారాను. క్షమాపణచెప్పుకునేఅర్హతను, ధైర్యాన్ని సంపాదించుకున్నా.

మాస్టారు నన్ను గుర్తించనేలేదు. ఈ పదిహేనేళ్ళలో ఆయన కొంచమైనా మారివుంటారా- అని పరీక్షించడానికే అలా నటించాను. నా పిచ్చిగాని, ఆయనకు పరీక్ష పెట్టడానికి నేనెంతటివాడను! ఆయన కొంచెం కూడా మారలేదు. ఎంత కవ్వించినా ఆయనకు కోపం రాదు. కోపం బదులుగా ఆయన స్వరంలో జాలి కురుస్తుంది. ఖేదం పలుకుతుంది. సమాజం నిండా వికటాట్టహాసం చేస్తున్న అవినీతి పిశాచాల మధ్య ప్రభావితం కాకుండా దృఢంగా నిశ్చలంగా వెలుగుతున్న న్యాయజ్యోతి ఆయన. ఆ జ్యోతి ఆరిపోకుండా కాపాడుకోవలసిన బాధ్యత నాకుంది.

అడగగానే సాయంచేస్తే లభించే ఆనందం క్షణికమే. అందుకే కరకుగా నటించాను. నిజానికి కొద్దికాలంగా మా తమ్ముడి చేత ఒక లఘు పరిశ్రమ ప్రారంభింపజేయాలని ప్రయత్నిస్తున్నా. నమ్మకస్తుడైన ఒక భాగస్తుని కోసం వెదుకుతున్నా. ఇప్పుడే మాస్టారి యింటికి వెళ్తా. ఆయన పాదాల మీద పడతా పదిహేనేళ్ళ క్రితం అడగలేక పోయా- ఇప్పుడు అడుగుతాను- మన్నించండి, మాస్టారూ!-అని. కన్నీటితో ఆ దివ్యచరణాలు కడుగుతాను. మాస్టారి అబ్బాయిని మా తమ్ముడి పరిశ్రమలో మానేజింగ్ పార్ట్‌నర్‌గా తీసుకుంటా" తన్మయంగా చెప్పుకుపోతున్న భర్తను యింతలేని కళ్ళనిండా సంతృప్తి నింపుకుని చూస్తూ "మీరు నిజంగా వరం ప్రసాదించే దేవుడు!" అనుకుంది సౌమ్య.